క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో బాలాజి తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కౌసలం, తల్లికి వందనం, ఆధార్ సీడింగ్, సిటిజన్ ఈకేవైసీ సర్వేలను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు సమస్యలపై ఇచ్చిన వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

రాజుపల్లిలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద శనివారం రాజుపల్లిలో వైద్య శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి మురళి తెలిపారు. మహిళలకు రక్తం, షుగర్, డెంగీ, మలేరియా తదితర పరీక్షలు చేసినట్లు తెలిపారు. పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ అలీకి సన్మానం



ఇర్ఫాన్ అలీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఇర్ఫాన్ అలీని శనివారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల క్లస్టర్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాలుర హైస్కూల్ హెచ్‌ఎం ధనలక్ష్మి, రవీంద్రనాథ, సుజాత, మహ్మదా లీ, రఫీ, అమరనాయక్ పాల్గొన్నారు.

ప్రతిబిడ్డకూ ఆధార్ తప్పనిసరి

పలమనేరు: ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రతి బిడ్డకూ ఆధార్ తప్పనిసరిగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం చెత్తపెంటలో పిల్లలకు ఆధార్ ఆవశ్యకతపై మహిళలకు అవగాహన కల్పించారు. అపార్ ఐడీ, పోషణ ట్రాకర్ యాప్‌లో పిల్లల వివరాలను నమోదు చేశారు. సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన

పలమనేరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దస్తావేజు లేఖరులు శనివారం కూడా పెన్‌డౌన్ చేశారు. వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వి.కోటను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



మొక్క నాటుతున్న సర్పంచ్ పిఎన్ లక్ష్మి

వి.కోట: పరిసరాలను శుభ్రంగా వుంచుకుని రోగాలు రాకుండా చర్యలు తీసుకుని వి.కోటను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని సర్పంచ్ పిన్ లక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శశికళ, నాయకులు రామన్న, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డులో గుంతలు పూడ్చాలని నిరసన



గుంతల వద్ద నిరసన తెలుపుతున్న టీచర్లు

పుంగనూరు/పెద్దపంజాణి: పుంగనూరు నుంచి బెంగళూరు వెళ్లే జాతీయ రహదారిలో కత్తార్లపల్లె క్రాస్ వద్ద పడిన గుంతలను పూడ్చాలని ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, గోపి తెలిపారు. వారు శనివారం రోడ్డుపై నిరసన తెలిపారు. వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పుంగనూరు నుంచి బెంగళూరుకు నిత్యం అనేక వాహనాలు వెళుతుంటాయని తెలిపారు. రోడ్డులో గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీధర్, ప్రసన్నలక్ష్మి, బాబాజాన్, అమరనాథ్, మురళి, సరస్వతి, అన్నదొరై, రఫీ పాల్గొన్నారు.

మొగిలి ఘాట్‌లో ఆగని రోడ్డు ప్రమాదాలు

పలమనేరు సమీపంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో వున్న మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదాలు ఆగడంలేదు. శుక్రవారం ఏకంగా మూడు ప్రమాదాలు జరిగాయి. ఒక లారీ డ్రైవర్ మృతి చెందగా ఇద్దరు క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మొగిలి ఘాట్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు భారీ కంటైనర్లు కారణమవుతున్నాయి. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితాలు ఇవ్వడం లేదు. ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతూ పలువురు మృత్యువాత పడుతూనే ఉన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

- తాజాగా మరోమూడు ప్రమాదాలు
- రైలింగ్‌తో కొంతమేర తగ్గుతున్న తీవ్రత
- ప్రమాదాలకు కారణమవుతున్న కంటైనర్లు



మొగిలి ఘాట్‌లో లారీని వెనుక నుంచి ఢీకొన్న లారీ(ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన లారీ ముందు భాగం (ఫైల్)

పలమనేరు: పలమనేరు సమీపం నుంచి వెళ్లే చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో మొగిలి ఘాట్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ మలుపులు ఎక్కువగా వున్నాయి. రోడ్డు విస్తరణకు ముందు గాంధీనగర్ వద్దనున్న మలుపులో ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. నాలుగు లేన్లుగా మార్చిన తర్వాత దొరచెరువు మలుపును సరిచేయలేదు. ముందున్న రోడ్డు కనిపించకపోవడం, సడెన్‌గా మలుపులో తిప్పాల్సి రావడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఇక్కడ డివైడర్ ఎత్తు కూడా చాలా తక్కువగా ఉండడంతో అదుపుతప్పిన వాహనాలు అటువైపు వెళ్లి ఇతర వాహనాలను ఢీకొంటున్నాయి. దీనికితోడు కర్ణాటక సరిహద్దు నంగళి నుంచి చిత్తూరు వరకు సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు లెవలింగ్ లేకపోవడం, వాహనాల చక్రాలకు గ్రిప్ దొరక్కపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.

పోలీసులు చర్యలతో తగ్గిన ప్రమాద తీవ్రత

గతంలో ఘాట్‌లో జరిగిన మేజర్ రోడ్డు ప్రమాదాలతో అధికారులు, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఘాట్‌లో రైలింగ్, సోలార్ లైట్లు, డేంజర్ సిగ్నల్స్, హెచ్చరిక బోర్డులు, తారు డబ్బాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగినా వాహనాలు ఓ వైపు కొండ, మరోవైపు రైలింగ్‌ను ఢీకొని ఆగిపోతున్నాయి. తద్వారా ప్రమాద తీవ్రత తగ్గుతోంది. శుక్రవారం జరిగిన మూడు ప్రమాదాల్లోనూ రైలింగ్ వల్ల తీవ్ర తగ్గినట్టు అధికారులు తెలిపారు.

రోడ్డుపై అవగాహన లేకపోవడం..

ఈ మార్గంలో రోజుకు సగటున 30 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో వందల సంఖ్యలో భారీ కంటైనర్లు ఉంటున్నాయి. బెంగళూరు నుంచి చెన్నైకి వయా క్రిష్ణగిరి మీదుగా హైవే ఉంది. ఆ రోడ్డులో ఎక్కువగా టోల్‌గేట్లు వున్నాయి. ట్రాఫిక్ కూడా ఎక్కువగా వుంటుంది. పలమనేరు మీదుగా వెళ్లే చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి ప్రయాణదూరం తక్కువగా వుంటుంది. అంతేగాక ట్రాఫిక్ కూడా తక్కువగా వుంటుంది. దీంతో డీజిల్ పొదుపు, నగదు మిగిల్చుకోవడం కోసం కంటైనర్ డ్రైవర్లు ఈ మార్గంలోనే ఎక్కువగా వస్తుంటారు. వీరికి ఈ ఘాట్ రోడ్డుపై అవగాహన లేక డౌన్‌లో వేగంగా నడుపుతూ మలుపుల్లో వాహనాన్ని అదుపుచేయలేక ప్రమాదాలకు కారణమవుతున్నారు.



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం(ఫైల్)

సదుం ఎంపీడీవోగా రాధారాణి



సదుం: ఎంపీడీవోగా రాధారాణి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కేవీబీ పురంలో ఏవోగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఏఓ హరిబాబు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేశారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని రాధారాణి తెలిపారు.

యువతి అదృశ్యం

పుంగనూరు: మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లెకి చెందిన యువతి(19) అదృశ్యమైంది. ఆమె పుంగనూరు పట్టణంలో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం ఉదయం ఆధార్ కార్డు జిరాక్స్ చేసుకోవాలని చెప్పి ఇంటి నుంచి వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

మహిళలకు వైద్య పరీక్షలు

పులిచెర్ల(కల్లూరు): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం ఆర్థికంగా బలోపేతమవుతుందని పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా 102 ఇ.రామిరెడ్డిగారిపల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది చంద్రయ్య, శ్రీదేవి, పురుషోత్తం, ప్రమీల పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్ట్ వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. రోగులు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు, ఫల్మనాలజీ, రేడియాలజీ, ఆప్తమాలజీ తదితర స్పెషలిస్టులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలాశయానికి చేరుతున్న వరదనీరు





ప్రవహిస్తున్న కౌండిన్య నది, తావడపల్లి మార్గంలోని కౌండిన్య చెక్‌డ్యామ్‌పై ప్రవహిస్తున్న నీరు

- మొరవ పారుతున్న పలు చెరువులు
- పొలాల్లోనే కుళ్లుతున్న టమాటా

పలమనేరు: నియోజకవర్గంలో నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు, కైగల్, ఎరిగినేరు ప్రవహిస్తున్నాయి. కౌండిన్య నదిలో నీటి ప్రవాహం మొదలైంది. ఇప్పటికే జల్లిపేట చెక్ డ్యామ్ నిండి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. శనివారం రాత్రికల్లా వరదనీరు వైఎస్సార్ జలాశయానికి చేరనుంది. నియోజకవర్గంలో 933 చెరువులు వున్నాయి. వాటిలో 24 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు కాగా, మిగిలినవి చిన్న చెరువులు. పది చెరువులు పూర్తిగా నిండిపోయి మొరవలు పారుతున్నారు. మిగిలినవి కూడా రెండు మూడు రోజుల్లో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు చెరువులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కట్టల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. అధికారులు తెలిపారు. భారీ వర్షాలకు టమాటా తోటల్లో నీరు నిలిచింది. కాయలు కుళ్లిపోతున్నాయి. తీగ పంటలైన కాకర, బీర, సొర, వంగ, తీగబీన్సు, చిక్కుడు తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరిశుభ్రతపై అవగాహన ఉండాలి



యానాదులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో బాలాజి, తహసీల్దార్ హనుమంతు

పెద్దపంజాణి: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో బాలాజి, తహసీల్దార్ హనుమంతు తెలిపారు. వారు శనివారం కోగిలేరు, కడపల్లి యానాది కాలనీల్లో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై యానాదులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. అనంతరం అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో మురుగేషన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, పీఎస్ చంద్రశేఖర్, వీఆర్వో బాలాజి పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవాలో భాగస్వాములు కావాలి

పుంగనూరు: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం మహిళా సంఘాల సభ్యులతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్‌టీఆర్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ కవర్ల నియంత్రణపై అవగాహన కల్పించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వారపుసంతలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

పలమనేరు: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య తెలిపారు. కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ తులసీరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మున్సిపల్ అధికారులు వారపుసంతలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసు వనంలో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, పీపీఎస్ నిర్వాహకులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల బ్యానర్ రాజకీయం

- కావాలనే వైఎస్సార్‌సీపీ బ్యానర్ల తొలగింపు
- కూటమి నేతల బ్యానర్లను పట్టించుకోని వైనం
- పంచాయతీ అధికారులపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం



ఆర్‌టీఐ కింద వివరాలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శికి అర్జీ అందజేస్తున్న మహేష్

గంగవరం: మండలంలో కూటమి నాయకులు బ్యానర్ల రాజకీయానికి తెరతీశారు. పంచాయతీ, పోలీసు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ నాయకుల బ్యానర్లను తొలగింపజేశారు. కూటమి నేతల బ్యానర్లను వదిలేసి తమ బ్యానర్లను మాత్రమే తొలగించడంపై వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు కిషోర్‌నాయుడు పుట్టినరోజు సందర్భంగా శనివారం గంగవరం పార్టీ కార్యాలయం వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని పంచాయతీ అధికారులు తొలగించి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగవరంలో టీడీపీ బ్యానర్లు ఏర్పాటు చేసి చాలా రోజులు అవుతున్నా తొలగించలేదు. తమ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బ్యానర్లు తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి నేతల ఒత్తిళ్లతోనే ఇలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్ వివరణ ఇస్తూ టీడీపీ బ్యానర్ల కోసం అనుమతులు పొందారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వారు అనుమతి లేకుండానే బ్యానర్లు ఏర్పాటు చేసినందున తొలగించామని వెల్లడించారు. మండలంలో వివిధ పార్టీల బ్యానర్ల ఏర్పాటుకు ఎన్నిసార్లు అనుమతి పొందారనే వివరాలు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ మండల ఆర్‌టిఐ వింగ్ అధ్యక్షుడు మహేష్ ఆర్టీఐ కింద పంచాయతీ కార్యదర్శికి అర్జీ సమర్పించారు.

పోషకాహార లోపంతోనే రక్తహీనత



సదుం: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వాణిశ్రీదేవి

సదుం: పోషకాహార లోపంతో రక్తహీనత కలుగుతుందని, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. ఆమె శనివారం సదుం సచివాలయంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో పాల్గొన్నారు. మహిళలు తమ రోజువారి ఆహారంలో ఆకు కూరలు, తృణ ధాన్యం, పండ్లు, కూరగాయలు, గ్రుడ్లు వుండేలా చూసుకోవాలన్నారు. అనంతరం పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు. సిబ్బందితో పోషణ మాసోత్సవ కమ్యూనిటీ ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజరు మల్లీశ్వరి, డాక్టరు చరణ్ పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలపై అవగాహన

పుంగనూరు: మండలంలోని మంగళంలో శనివారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. లేకుంటే రక్తహీనత ఏర్పడుతుందని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

స్కూలు బ్యాగులు పంపిణీ



బడుగుమాలకులపల్లిలో బ్యాగులు అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

శాంతిపురం: మండలంలోని సొన్నేగానిపల్లె పంచాయతీ నాయనపల్లి, కెనమాకులపల్లి పంచాయతీ బడుగుమాకులపల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం బెంగళూరుకు చెందిన ఒక కార్పొరేట్ సంస్థ ప్రతినిధులు స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా వరుసగా నాలుగో ఏట మొత్తం 324 మంది విద్యార్థులకు బ్యాగులు అందజేసినట్టు కంపెనీ ప్రతినిధులు జీఎం అశ్వత్‌బాబు, జేఎం కృష్ణమూర్తి తెలిపారు.

ఉపాధ్యాయులతో సమావేశం

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈవో నటరాజ ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో వచ్చిన గ్రేడ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోధన పద్ధతులను మెరుగు పరుచుకోవాలని సూచించారు. బడికి తరచూ హాజరుకాని విద్యార్థులకు విద్యను ఎలా బోధించాలనే విషయాలను వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని హాకింగ్ పాఠశాలలో పనిచేస్తూ డీఎస్సీలో ఎంపికైన శబరినాథ్, మోహన్‌కుమార్‌ను శనివారం కళాశాల చైర్మన్ హఫీజ్, యాజమాన్యం ఘనంగా సత్కరించారు. హఫీజ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో పనిచేస్తున్న వారు డీఎస్సీలో ఎంపిక కావడం సంతోషంగా వుందని తెలిపారు.

మహిళలకు టాటా హెల్త్ కేర్ వైద్యం

శాంతిపురం: టాటా హెల్త్ కేర్ ద్వారా మహిళలకు వైద్య సేవలు అందించనున్నట్టు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక సచివాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు టాటా హెల్త్ కేర్ వైద్యసేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో తొలిసారి పైలెట్ ప్రాజెక్టు కింద కుప్పం నియోజకవర్గంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. రోగుల వివరాల ఆధారంగా టాటా హెల్త్ కేర్ కమాండ్ కంట్రోల్ నుంచి వైద్యం, సలహాలు అందుతాయన్నారు. మండలంలో 4,450 మందికి గుర్తింపు నంబర్లు ఇచ్చామన్నారు. మరో 7 వేల మంది రిజిస్టర్ చేసుకోవాల్సి ఉందని చెప్పారు.

పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేద్దాం



సదుం: సమావేశంలో పాల్గొన్న పెద్దిరెడ్డి, సోమశేఖర్ రెడ్డి

సదుం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. వారు శనివారం సదుంలో నిర్వహించిన గ్రామ కమిటీ ఏర్పాటు సమావేశంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామ కమిటీలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత వారిపై ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలన్నారు. జోగివారిపల్లెలోను కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, సయ్యద్‌బాషా, పుత్రాజు, చిన్నరమణ, రవి, కాలేషా, షబ్బీర్, మల్ రెడ్డి, మనోజ్, శివారెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవ చేయాలి



పట్టాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కుప్పం రూరల్: విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తర్వాత విద్యార్థులు సమాజ సేవ చేయాలని అనంతపురం జేఎన్‌టీయూ వీసీ హెచ్.సుదర్శనరావు తెలిపారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే-2025లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తాము చదువుతున్న విద్యను వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ సేవకు, దేశానికి ఉపయోగించిన నాడే ఆ వ్యక్తికి పరిపూర్ణత సిద్ధిస్తుందన్నారు. బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో విద్యను అభ్యసిస్తే లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని వివరించారు. అనంతరం ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ రుక్మిణమ్మ

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ జెడ్పీటీసీ రుక్మిణమ్మ తెలిపారు. ఆమె శనివారం చౌడేపల్లెలో పార్టీ నేతలు, కార్యకర్తలతో రచ్చబండ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయడానికి కమిటీలను ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. రోబోయే రోజుల్లో గ్రామ కమిటీలు కీలకంగా వుంటాయని తెలిపారు. కూటమి నేతల దౌర్జన్యాలను, అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించి చైతన్యం తేవాలని కోరారు. అనంతరం కమిటీలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆల్తాఫ్, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ బోయకొండ డైరెక్టర్లు నాగరాజ, పవన్‌కుమార్, విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్, రాంబాబు శ్రీనివాసులు, సున్నా భాస్కర్, మంజునాథ్, కృష్ణప్ప పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పలమనేరు: విద్యార్థులకు పెండింగులో వున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఎస్‌ఎస్‌ఎఫ్ నాయకుడు మున్నా డిమాండ్ చేశారు. ఆయన శనివారం విద్యార్థులతో కలిసి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్ల ఉన్నాయని తెలిపారు. ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంజయ్, సమీర్, అమన్ తదితరులు పాల్గొన్నారు.